క్లుప్తంగా

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

తాడేపల్లి రూరల్: కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. విట్ ఏపీ యూనివర్సిటీ కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆటో కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాజధాని డివిజన్ కార్యదర్శి భాగ్యరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మికులకు ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతులకు తీసుకొచ్చిన చట్టాల వలన భవిష్యత్తులో రైతులు పండించిన పంట అమ్ముకునే పరిస్థితి కూడా లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, సామాన్యులు బతకలేని పరిస్థితిలోకి నెట్టివేస్తున్నారని అన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మార్పునకు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డి.ఇ. అక్కుల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిడమర్రు-నీరుకొండ రోడ్డు విస్తరణ నిమిత్తం లైన్లను పక్కకి మార్పు చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు



గరికపూడి సౌదామని (ఫైల్)

మోరంపూడి(తాడేపల్లి రూరల్): మండల పరిధిలోని మోరంపూడిలో నివాసముండే గరికపూడి సౌదామని(70) కనిపించడం లేదంటూ తన చిన్నకుమారుడు మల్లికార్జునరావు పెరికలపూడి సచివాలయంలో ఫిర్యాదు చేశాడు. సేకరించిన వివరాలు ప్రకారం మోరంపూడిలో నివసించే సౌదామని అప్పుడప్పుడు ఇంట్లో నుంచి వెళ్లిపోతుందని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని, చుట్టు పక్కల విచారించినా ఆమె ఆచూకీ లభించలేదని వివరించారు.

ఎన్టీఆర్ సినిమాలపై చర్చావేదిక



తెనాలి: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు శత జయంతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇక్కడి పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఎన్టీఆర్ నటించిన సినిమాలు, వ్యక్తిత్వం, రాజకీయ జీవితంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. కంచర్ల కాశయ్య, మల్లవరపు విజయ్ ప్రసంగించారు. వీరితోపాటు స్థానిక కళాకారుడు, అమ్మ డ్యాన్స్ అకాడమీ ఈశ్వర్‌ను సత్కరించారు. దేవరపల్లి భవాని, చెరుకుమల్లి సింగారావు ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, కొండముది రమేష్, వెనిగళ్ల శివప్రసాద్, ఉమ్మలనేని ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

గాలి బీభత్సం



పెదవడ్లపూడి కొత్తపాలెంలో నేలవాలిన వేప చెట్టు



తెనాలి- మంగళగిరి రహదారిలో విరిగిపడిన వృక్షాలు

గాలి వాన బీభత్సం సృష్టించింది. ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఈదురుగాలులతో భారీ చెట్లు కూలిపోయాయి. రేకుల షెడ్లు దెబ్బతిన్నాయి. పంటలకు స్వల్పంగా నష్టంవాటిల్లింది.

–తాడేపల్లి రూరల్

పంట పొలాలను పరిశీలించిన అధికారులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ మండల అధికారులు ఆదివారం పరిశీలించారు. వ్యవసాయ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ అకాల వర్షాల వలన పడిపోయిన అరటి, మొక్కజొన్న పొలాలను పరిశీలించినట్లు చెప్పారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు కూడా పంట నష్టపరిహారాన్ని అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. పంట నష్ట పరిహార జాబితాను వెంటనే తయారు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టాన్ని అంచనా వేయండి

తాడేపల్లి రూరల్: మంగళగిరి మండల పరిధిలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళగిరి వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వలన అరటి, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతిన్నాయని, మొక్కజొన్న పాలుపోసుకునే దశలో దెబ్బతినడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. సోమవారం నుంచి పంట నష్టాన్ని అంచనా వేసి వివరాలు అందజేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాస రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి శైలజా రాణి, ఉద్యాన శాఖ అధికారిణి దీపిక పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మిర్చి రైతులు కలవరపడుతున్నారు. మండలంలోని బేతపూడి, మేరికపూడి, నుదురుపాడు, వేములూరిపాడు, తక్కెళ్లపాడు, యర్రగుంట్లపాడు, 113 తాళ్లూరు, శిరంగిపాలెం గ్రామాల్లో మిర్చి కోతలకు చేరింది. పలువురు రైతులు కోసిన మిరపకాయలను కల్లాల్లోనే ఎండబెడుతున్నారు. అకాల వర్షం కారణంగా కల్లాల్లో ఉన్న మిర్చి పై పరదాపట్టలు వేశారు.



బేతపూడి పొలాల్లో మిరపకాయలపై పట్టలు కప్పుతున్న మిర్చి రైతులు

మిరప పంటలో సస్యరక్షణ

తాడికొండ: ప్రస్తుతం రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారి అశోక్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

- ప్రస్తుతం మిరప పంట (రెండు, మూడో) కోత మరియు కల్లాల్లో ఎండుతున్న దశలో ఉంది. కల్లాల్లో ఉన్న కాయలు తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి జాగ్రత్త చేసుకోవాలి.
- అధిక తేమ వల్ల పంట మీద ఉన్న కాయలకు కాయకుళ్లు రావడానికి అవకాశం ఉంది. కావున ముందు జాగ్రత్తగా మాంకోజెబ్ (లీటరు నీటికి 2.5గ్రాములు) లేదా క్లోరోథలోనిల్ (లీటరుకి 2 గ్రాములు) లేదా థయోఫినైట్ మిథైల్ (లీటరుకి 2గ్రాములు) పిచికారీ చేయాలి.
- తెగులు ఉధృతి నివారించడానికి డైఫిన్‌కొనజోల్ 0.5మిలీ లేదా ప్రొపికొనజోల్ ఒక మిల్లీలీటరు పిచికారీ చేసిన తరువాత క్యాబ్రియోటాప్ లీటరు నీటికి 3 గ్రాములు లేదా అజాక్సీస్ట్రోబిన్ ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.
- సూక్ష్మ పోషక మిశ్రమం (ఎగ్రోమిన్‌మాక్స్) లీటరు నీటికి 2.5గ్రాముల చొప్పున, స్థూల పోషక మిశ్రమం (13-0-45) లీటరు నీటికి 5గ్రా చొప్పున పంటపై పిచికారీ చేయాలి.
- వర్షాలు ఆగిన తరువాత కోత కోసి ఎండబెట్టేటప్పుడు కాయకుళ్లు ఆశించిన కాయలను వేరుచేసి విడివిడిగా ఎండబెట్టుకోవాలని సూచించారు.

రేపు కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా

తాడేపల్లి రూరల్: దళితులపై మతోన్మాద బీజేపీ దాడులను అరికట్టాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు కోసం మార్చి 21న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరం బైపాస్‌రోడ్‌లోని కేటీ భవన్‌లో కేవీపీఎస్, డీహెచ్‌పీఎస్, ఉభయ వ్యవసాయ కార్మిక, దళిత, గిరిజన సంఘాల నాయకులతో కలసి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మత విద్వేషాలు రెచ్చగొడుతూ దళితులపైన, ముస్లిం మైనార్టీలపైన దాడులు చేస్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కలతో పాటు కుల ప్రాతిపదికపై విడిగా జనాభా లెక్కలు సేకరించాలని, పవర్ ఆఫ్ అటార్నీ చట్టాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని, కుటుంబానికి 200 రోజులు పని దినాలు, రోజు వారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ గుంటూరు జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్‌బాబు, నాయకులు కంప వెంకటయ్య, పల్లె కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి, గిరిజన సంఘం నాయకులు బాల్య నాయక్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

పంటల పరిశీలన

తెనాలి: అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. ఆదివారం రైతుసంఘం బృందం పట్టణ అయితానగర్, సమీప నేలపాడు గ్రామంలో జొన్న, మొక్కజొన్న పైర్లను పరిశీలించారు. మాండూస్ తుఫాన్ వల్ల భూములు తడి ఆరకపోవటంతో తర్వాత వేసిన జొన్న, మొక్కజొన్న పైర్లు ఆశించినంతగా ఎదగలేదని మేకల చిట్టిబాబు చెప్పారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల యాపిల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ఆదివారం పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ వేడుక ఘనంగా నిర్వహించారు. మండలంలోనే ప్రథమ స్థానం సాధించిన యాపిల్ విద్యార్థి పూర్ణ చంద్రరావుకు యాపిల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఇమ్మడి రవికుమార్ రూ.25 వేలు ప్రోత్సాహక బహుమతి అందించారు. అదే విధంగా మండంలోనే రెండో స్థానం సాధించిన యాపిల్ విద్యార్థిని గూడపాటి యశస్వినికి పేరేచర్ల ఆర్ఆర్ సంస్థ అధినేత చదలవాడ రమేష్ రూ.10వేలు నగదు ప్రోతాహకం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మోరపాకుల అజయ్‌కుమార్ మాట్లాడూతూ విలువలతో కూడిన విద్య ఉన్నత శిఖరాలను అందిస్తుందని అన్నారు.

ధ్యాన శిక్షణ

తెనాలి: శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్నెస్ సంస్థ, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా చేపట్టిన మూడురోజుల ధ్యాన శిక్షణ మహోత్సవం ఆదివారం స్థానిక తాలూకా జూనియర్ కాలేజి మైదానంలో ప్రారంభమైంది. ఆజాదీ కా అమృతోత్సవ్ సందర్భంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటైన కార్యక్రమానికి మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీరామచంద్ర మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీరామ చంద్ర మిషన్ ధ్యానశిక్షణతోపాటు శారీరక స్వస్థత కోసం యోగాసనాలు, ప్రాణాయామం, ముద్రలు మొదలైన వాటిలో శిక్షణనిస్తూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తోందని చెప్పారు. ఈ శిక్షణలో మూడురోజులు స్థానిక ప్రజలు హాజరై ప్రయోజనం పొందాలని కోరారు. తెనాలి కో-ఆర్డినేటర్ ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీరామచంద్ర మిషన్‌కు తెనాలిలో గల మూడు ధ్యాన కేంద్రాల్లోనూ శిక్షణనిస్తున్నట్టు తెలిపారు.

ఆపన్నులకు వరం

- ఇంటి, ఖాళీస్థల పన్నులపై వడ్డీ మాఫీ
- ప్రజలపై భారం తగ్గించిన ప్రభుత్వం
- తెనాలిలో సుమారు 7వేల మందికి రూ.8కోట్ల మేర లబ్ధి

తెనాలిఅర్బన్: ఇంటి, ఖాళీ స్థల యజమానులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఏళ్ల గడుస్తున్న ఇంటి, ఖాళీ స్థల పన్నులను బకాయిపడి అవి వడ్డీలతో కలిపి రెండింతలు కావడంతో చెల్లించే ఆర్థిక స్తోమత లేక సతమతమవుతున్న ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఈనెల 31లోపు పన్నులు చెల్లించే వారికి వడ్డీని రద్దు చేస్తు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల తెనాలి మున్సిపాలిటీ పరిధిలోని సుమారు ఏడు వేల మందికి రూ.8కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. తెనాలి పురపాలక సంఘ పరిధిలో సుమారు 35వేలకుపైగా నివాస గృహాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ మంది సకాలంలో పన్నులు చెల్లిస్తుంటారు. వీటి వల్ల సుమారు ఏడాదికి 15.70 కోట్ల ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఇవి కాకుండా తెనాలి పట్టణంలో 2,595 ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటి యజమానులు వివిధ కారణాల రీత్యా(బ్యాంక్ రుణాల కోసం) పన్నులు వేయించుకుని మొదటి అర్ధ సంవత్సరం చెల్లించిస్తారు. ఆ తర్వాత పన్నులు చెల్లించకుండా అలా వదిలేస్తారు. వారిలో ఎక్కువ మంది ఇతర ప్రాంతాలలో నివసిస్తుండటం వల్ల వారి ఆచూకీ దొరకక మున్సిపల్ సిబ్బంది ఇబ్బందులు పడుతుంటారు. చేసేది లేక వాటికి వడ్డీలు వేస్తూ వస్తుంటారు.



తెనాలి మున్సిపల్ కార్యాలయం

ఏడు వేల మందికి లబ్ధి

తెనాలి పట్టణంలో ఇంటి పన్ను బకాయిలు ఉన్నవారు 5,269 మంది ఉన్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. వీరు కాకుండా ఖాళీ స్థల యజమానులు 2,595 మంది ఉన్నారు. వీరిలో సకాంలో పన్నులు చెల్లించని వారు 1,685 మంది ఉన్నారు. వీరందరూ ఇప్పుడు ఇంటి, ఖాళీ స్థల పన్నులు అసలుతోపాటు వడ్డీని కలిపి చెల్లించాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మార్చి 31వ తేదిలోపు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని ప్రకటించింది. దీనివల్ల కేవలం పన్ను మొత్తం చెల్లిస్తే సరిపోతుంది. వడ్డీ మాఫీ వల్ల సుమారుగా ఏడువేల మందికి రూ.8కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

31లోపు చెల్లించండి



ఇంటి పన్ను బకాయిదారులకు వడ్డీని మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం పెండింగ్‌లో ఉన్న ఖాళీ, ఇంటి స్థల యజమానులు పన్నులపై విధించిన వడ్డీని రద్దు చేసింది. దీనివల్ల ఏడు వేల మందికి లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును ఉపయోగించుకోండి.

– ఎం.జశ్వంతరావు, కమిషనర్, తెనాలి

ఉగాది కవి సమ్మేళనం



తెనాలి: పట్టణానికి చెందిన శారదా సాహితీ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏర్పాటైన సభకు ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అధ్యక్షత వహించారు. సమితి కార్యదర్శి డాక్టర్ సామల లక్ష్మణబాబు ఉగాది సందేశం వినిపించారు. కవి సమ్మేళనంలో పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ జ్యోతిస్వరూపరాణి, ఈఎల్‌వీ అప్పారావు, ఆళ్ల నాగేశ్వరరావు, కాకరపర్తి సుబ్రహ్మణ్యం, పాతూరి సుబ్రహ్మణ్యం, మొవ్వా సుబ్బారావు, మునిపల్లి రఘునాథరావు తమ కవితలను వినిపించారు. అనంతరం కవులకు ప్రశంసాపత్రం, జ్ఞాపికను బహూకరించారు. గ్రంథాలయ పాలకురాలు రమాదేవి శుభాకాంక్షలు తెలిపారు. పాతూరు నాగేంద్రం వందన సమర్పణ చేశారు.

నవరత్నాలతోనే ప్రజాసంక్షేమం

- పార్టీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- గుండాలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాలు వివరిస్తున్న నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గుండాలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి వారికి అందిన సంక్షేమాన్ని వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సురేష్‌కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరాలు అడగడంతో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రభుత్వం రూ.11 లక్షల 98వేలు కేటాయించినట్లు త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. శ్మశానవాటికకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరడంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పి.మరియబాబు, వసంతరావు, షేక్ సైదా, ఎం.సుధాకరరెడ్డి, రాజేష్, చిట్టా సీతారెడ్డి, జోజిబాబు, పి.తంబి, బాజి, హుస్సేన్, ఎ.రత్నం, బాబు, ఎస్.దాసు, పుల్లారావు, అప్పిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మీరా, టి.కృష్ణ, నాగరాజు, తహసీల్దార్ పద్మనాభుడు, సాయి, పుల్లారెడ్డి, ఏపీఎం సుజాత, కార్యదర్శి లక్ష్మీశారద పాల్గొన్నారు.

ఘనంగా ఇంటెల్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

మేడికొండూరు: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి విజయాలు సాధించాలని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ కేజీ శంకర్ అన్నారు. మండలంలోని పేరేచర్ల ఇంటెల్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. రిటైర్డ్ జడ్జి డాక్టర్ శంకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా చదువు ద్వారానే తమ స్థితిగతులు మారతాయని, తమ అభిరుచులకు అనుగుణంగా మంచి ఉన్నతమైన లక్ష్యాలను పెట్టుకుని రాణించాలని అన్నారు. అదే విధంగా కార్యక్రమంలో ఇంటెల్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ తల్లి దండ్రులు ప్రతిపనిలోను కష్ట పండటం పిల్లలకు అలవాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి డాక్టర్ శంకర్ సతీమణి కృష్ణ కుమారి, ఇంటెల్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కోనూరి అశోకరాణి జయకుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి డాక్టర్ కేజీ శంకర్

మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి

తాడేపల్లి రూరల్: తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని ఆదివారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులో నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం తన పన్నెండేళ్ల వయసులోనే ఆంధ్ర మహాసభలో చేరిందని, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక బాధ్యతల్ని నిర్వహిచారని అన్నారు. వ్యవసాయ కార్మికులకు కూలిరేట్లు పెంచాలని పోరాటం చేసిందని, కుల వివక్ష వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్నారని, అటువంటి వ్యక్తిని స్ఫూర్తిగా తీసుకునిముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.సాంబశివరావు, ఎం.కోటేశ్వరరావు, కె.మరియమ్మ, బి.దుర్గ, ఆర్.పాప, జి.బాలచంద్రుడు, డి.నాగేశ్వరరావు, కె.ప్రభుదాస్, బి.రాజు, వి.మహేష్, ఎం.బాబు పాల్గొన్నారు.



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తాడేపల్లి రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేఎల్‌యూ సీఎస్ఐటీ విభాగ అధిపతి డాక్టర్ కె.అమరేంద్ర సూచించారు. సీజన్ వ్యాధులపై చిర్రావూరులో అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.అమరేంద్ర మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారని అన్నారు. పరిసరాలు శుభ్రంగా లేకుంటే వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వివరించారు. వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని స్థానికులకు విరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం నిర్వహించారు.



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

సగరుల బైక్ ర్యాలీ

తాడేపల్లి రూరల్: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న సగర ఆత్మీయ సమ్మేళనానికి బైక్ ర్యాలీగా ఆదివారం తరలివెళ్లారు. టీటీడీ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితులు తాడిశెట్టి మురళీమోహన్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయంగా గుర్తించబడిన విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయం చైర్మన్ పదవిని సగరలకు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి సగరులను గుర్తించి వారికి కోసం స్థలం, నిధులు కేటాయించి కమ్యూనిటీ హాల్ నిర్మించారని అందుకు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో గంగా భగీరథ సంఘం అధ్యక్ష, కార్యర్శులు పందేటి సాంబశివరావు, జుట్రు ఏడుకొండలు, నాయకులు నంగళం ప్రసాద్, కర్నాటి శివ సత్యానారాయణ, కటారి విష్ణుమూర్తి, గండికోట రాజారావు, అచ్చయ్య, కలవకొల్లు గోపిబాబు పాల్గొన్నారు.



విజయవాడకు బైక్ ర్యాలీతో బయలుదేరిన సగరులు

సప్తగిరి సంకీర్తన

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవేంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 520వ ఆరాధనోత్సవం జరిగింది. తొలుత శ్రీవేంకటేశ్వరస్వామికి అర్చన చేసి, పాత్తూరి వెంకట ఆదిలక్ష్మి సంకీర్తనాగానం ప్రారంభించారు. తదుపరి కంకిపాటి పద్మావతి బృందం కోలాట ప్రదర్శన చేసింది. గౌరావఝుల ఆంజనేయశాస్త్రి సారథ్యంలో యల్లాప్రగడ జానకి, కొండపి వసుంధర, శివసుధీర్‌కుమార్, వఝుల లక్ష్మీసునీత, నేరెళ్ల కళ్యాణి, మూర్తి అనూరాధ, సొల్లేటి శైలజ, చుండూరు ఆదిలక్ష్మి బృందాల్లోని 200 మంది గాయకులచే సప్తగిరి సంకీర్తన నాలుగు గంటలపాటు నిర్వహించారు. తెనాలిలోని గురువులకు సంస్థ తరపున సత్కారం చేశారు. డాక్టర్ కె.పురుషోత్తం, డాక్టర్ జీవనలత, వుప్పల వరదరాజులు, లక్కరాజు లక్ష్మణరావు, డాక్టర్ బ్రహ్మాజీ పాల్గొన్నారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.